
కథ

# తోడుకోని పాలు

## శండిల



"నాన్నా! అమెరికాలో ఉద్యోగం మానేసి వచ్చేశా..."సుబ్బరామయ్యగారికి షాక్ కొట్టినట్టు ఈ వార్త తగులుతుందనుకున్నాడో ఏమో శ్యామసుందర్ అనేశాడు.

"మంచి పని చేశావ్" కోపంతోనే ఊడిపడింది తండ్రి స్పందన. ఆ తీవ్రత అంతా చకారగుడి వత్తి వత్తి పలకడంలోనే ఉందని పసిగట్టేందుకు శ్యామసుందర్‌కి అట్టేసేపు పట్టలేదు.

సుబ్బరామయ్య కొడుకుమీద మండిపడుతున్నారంటే కారణం ఇదొక్కటే కాదు. గ్రంథం చాలానే ఉంది. శ్యామసుందర్ న్యూయార్క్ వెళ్లాకా అతడి ప్రవర్తను గురించి కొందరు మిత్రులు సుబ్బరామయ్యగారికి రాసిన ఉత్తరాలల్లో దొర్లిన విశేషాలు-మచ్చుకు కొన్ని.

"శ్యామసుందర్ న్యూయార్క్‌లో జూలియట్ అనేదానితో తిరుగుతున్నాట్ట. లేదు ఆమే అతన్ని వలలో వేసుకుని తన చుట్టూ అలివేలంగా త్రిప్పుకొంటున్నదట!"

వాళ్లు ఒకళ్లనింకొరు ఒల్చుకుందామనుకున్నా వీలేనంతగా అంటిపెట్టుక కరుచుక తిరుగుతున్నారు. న్యూయార్క్‌లో తెలుగువాళ్లు వీళ్ల ఇద్దరిమీదా అల్లుకు ప్రచారం చేసుకుంటున్న కథలెన్నో!"

"జూలియట్... ఎవరీ జూలియట్? మాడ్రిడ్ నుంచి విస్టన్ మీదుగా న్యూయార్క్‌కి ఎగిరివచ్చిన పంచవన్నెల రామచిలుక. చిలుకపలుకుల్లో చిలిపితనం, కోయిలపాటలల్లో తియ్యదనం రంగరించుకుని ఈ పడుచు పుణికి పుచ్చుకుంది."

క్రమక్రమంగా తాయి పడుతామనుకుంటూంటే సుబ్బరామయ్య లోపల మథన, బాధ ఎక్కువౌతున్నాయి. కాదుమరీ, అమెరికాలో నెలకు లక్షరూపాయలకు విలువైన జీతం తెచ్చుకునే కొడుకు, సిద్ధాన్నం కాలదన్నుకుని, పనిమానేసి ఇంటి కొచ్చాసాడంటే ఏ తండ్రి బాధపడడూ?

ఒకపక్క ఈ రంధి... ఇంకొక వంక పెళ్లికాని సుపుత్రుడు విదేశాలకు వెళ్లి, ఉద్యోగం వెలగబెట్టి, ఎవత్తెతోనో "ప్రేమాయాణమో" ఇంకేదో సాగించి, పదిమంది నోళ్లలోనూ పడి కథ కంచికి అన్నట్టు ఇప్పుడింటి కొచ్చిపడ్డాడు. ఇక ఇప్పుడు తానేమిటీ చెయ్యడం?" సుబ్బరామయ్యగారికీనాడు మిగిలిన ప్రశ్న.

000

శ్యామసుందర్ మళ్లీ మొదలెట్టాడు ఉద్యోగానికై వేట-ఢిల్లీలో ఏదో ఇంటర్వ్యూ వస్తే వెళ్లాడు. ఈ మధ్య తండ్రీ, కొడుకూ ఎడమొగం, పెడమొగం గానే ఉంటున్నారు. శ్యామసుందర్ ఢిల్లీ వెళ్లిననాటి సాయంత్రం సుబ్బరామయ్యగారు అందుకున్నాడు అమెరికా నుంచి శ్యామసుందర్ పేర వచ్చిన ప్యాకెట్.

ఏవేవో పుస్తకాల పార్సెల్ అదీ. విప్పి చూడబోతే దానిలో రెండు చిన్నపుస్తకాలు. ఒకటి భగవద్గీత, మరోటి స్వామీ వివేకానంద ఉపన్యాసాల సంపుటి.

చక్కగా అమర్చి పెట్టినట్టు ఆరెండింటి మధ్యా ఓ కాయితం, ఉత్తరం కాదు. ఏదో దినచర్య నుంచి ఎత్తిపెట్టిన ఓ పేజీలో ముక్క అదీ. జూలియట్ డైరీ నుంచి చించివేసి ఉండవచ్చు. మళ్లీ మళ్లీ చదువుకుంటున్నాడు సుబ్బరామయ్య. ఏవేమో ఆలోచనలు ముసురుకుంటుంటే-

"అహో! భారతదేశం ఎంత గొప్పదో! అవధుల్నిదాటిన ఆ తీరం, తీరంలో సాగరంలోని ముత్యాలు, రత్నాలు ఎన్నెన్నో! వాటిని గూర్చి తెలుసుకోవడం ఎలా? ఏదో నాలో అంతులేని తపన, ఆవేదన దీనికో ఆలంబన అవసరం అన్వేషించాలంటే, వెదుక్కుంటూ పోతుంటే ఆ తీగ నాకాలికి తానే తగిలింది. నేను ఇతని స్నేహంలో శ్యామసుందరుడి సహజీవనంలో, కొంతైనా నేను సాధించదలచుకున్నది పొందగలనంటావా? సరే ప్రయత్నిద్దాం"

ఇదీ జూలియట్ కోరిక. కాదు ఆకాంక్ష. ఇంతదూరం వచ్చాకా ఇక ఇప్పుడు జూలియట్ ఆశ ఉచితమా? కాదా? తేల్చుకోవలసిన అవసరం లేదని సుబ్బరామయ్య ఇట్టే గ్రహించారు.

000

శ్యామసుందర్ ఢిల్లీ వచ్చి రెండురోజులయ్యింది. ఏమిటో ఆ ఇంటర్వ్యూ సరిగ్గా జరగలేదు. ప్రతిక్షణమూ అదే ధ్యాసగా జూలియట్ అతని ఊహల్లో సుడులు తిరుగుతోంది.

ఔను! నాకిదంతా తెలిసే జూలియట్‌ని కలిశాను. నా జీవనయానంలో ఓ మజిలీ గడవటానికే ఆమె రాక. అలాగే స్వాగతించాను ఆ యువతిని. ప్రేమించానా లేదే. పెళ్లి చేసుకోవాలనుకున్నానా కాదే. మరి ఆమెతో నడిచిన దారి? గడిపిన మరపురాని మధురక్షణాలు??

అబ్బా! చెప్పలేను. జూలియట్ నా దోసిట తేనె ఎందుకో ఒకందుకు పోసింది. నేనూ ఆ మధువు తనవితీరా జుర్రుకున్నాను.

ఇంతలోనే ఇంకో ఊహాకెరటం. జూలియట్ నాతో మాటమట్టుకైనా చెప్పకుండా వెళ్లిపోయింది. నేను ఆమెను అనుభవించినట్టు ఇంకొకడు అనుభవించకూడదని తుచ్ఛస్వార్థంతో నేను కృంగిపోయాను. ఇంతకీ నాకామె ఏమౌతుందనీ? లోగడ ఎవరెవరికో, ఎక్కడెక్కడో ఆమె నాకిచ్చినట్టే అధరసుధారసం వాళ్లకీ పంచి పెట్టింది. ఇది స్పష్టంగా ఎరిగుండీ నేను జూలియట్‌ని గుండెకు హత్తుకున్నా. మరి ఇక అలాంటప్పుడు ఆమె గురించి ఇప్పుడు ఇక్కడ మనసు పాడుచేసుకోవడం ఎందుకూ? అప్పుడు నేను చేసిన, ఇప్పుడు చేస్తున్నది నేరం కాదా? తెముల్చుకోలేక తెగ తికమక పడిపోతున్నాడు శ్యామసుందర్.

ఔనూ, ఇంతకీ నానుండి ఏమాశించి ఈ జూలియట్ నన్నాశ్రయించినట్టు? డబ్బు లేదంటావా కోటీశ్వరుడి కూతురు. చక్కదనాల చుక్క అందాలరాశి. అంతా కూడి పాతిక పైదాటని పసిడి యౌవ్వనం. పోనీ చదువు అందామా నాకన్న రెండాకులు ఎక్కువే వెలగబెట్టింది. జూలియట్ ఓ చిరునవ్వు రువ్వితే చాలు న్యూయార్క్‌లో ఆమె ముంగిట పడి చచ్చేవాళ్లు కోకొల్లలు. మరిక నాలో ఏం చూసి అబ్బా ఇది మిటమిటలాడుతూ, నాపై ఎగసి ఎగసి పడుతూ నన్ను నిలువునా త్రాగెయ్యాలని ఊటలు మ్రింగుతున్నాదీ. ఇలా ఎన్నిసార్లు నన్ను నేనే నిలేసుకోలేదు? ఇదొక బావతు తీయతీయని తలపుల నెమరువేత.

ముందు ఊహలు వెనక్కీ, వెనక తలపులు ముందుకీ మనసులో కెళ్లుతూ శ్యామసుందర్‌కి నిద్రను దరి చేరనియ్యటంలేదు.

000

శ్యామసుందర్ ఢిల్లీ నుంచి రావటం రెండు రోజులు ఆలస్యం అయింది. ఈలోగా అమెరికా నుంచి అదే జూలియట్ నుంచి మళ్లీ ఉత్తరం వచ్చింది అతని పేర. సుందరరామయ్య విప్పి చదువుకున్నాడు. అదీ డైరీలోంచి ఓ పేజీయే.

"శ్యామసుందరుని పొంది, శారీరకంగా అతని కౌగిలిలో కరిగిపోతున్నా అనుకుంటూ ఒక మధురాతి మధురమైన దివ్య సౌందర్యాన్ని ఆస్వాదించి ఆ అనుభూతి ఫలంగా ఒక ఆత్మవిజయం సాధించి చిరకాలంగా నాలో ఉన్న ఒక స్వప్న సాక్షాత్కారాన్ని కళ్లతో తనివితీరా చూసి, ఆ తీపిగుర్తుల మూర్తిని కలకాలం నా ముందు నర్తింపజేసుకోవాలన్న వాంఛ తీరే ఆస్కారం లేదని తెలుసుకున్నాకా -

ఎందరెందరో వైద్యుల్ని, మనస్తత్వవేత్తల్ని ఆశ్రయించా. సలహా సంప్రదింపులు జరిపా. "ఆ విత్తనం ఈ నేలను మొలకెత్తదూ. ముమ్మాటికీ నిజం. ఆ చూలు ఇక్కడ కట్టదు. నాది తీరని కోరికగానే మిగిలిపోయింది." ఎవర్నడిగినా లాభంలేదని పెదవి విరిచినవాళ్లే అందరూ.

మరింకెందుకూ ఈ శ్యామసుందరునితో నా ప్రయాణం? అనుకుని ఓ నిర్ణయానికొచ్చా. ఇతడినీ వదిలెయ్యాలి. కానైతే ఈతనికి ముందు నేను కౌగిలిలో పొదవుకొని, వడిసిపట్టుకొన్న వాడివలే మాత్రం కాదు!

ఇంత దూరం వచ్చాకా ఇక ఇప్పుడు సుందరరామయ్య బాధ కొంతలో కొంత తగ్గింది. హృదయంలో ఆరాటం స్థానే ఊరట చోటు చేసుకుంది. తనకు తానే సర్ది చెప్పుకున్నాడు.

అమెరికాలో ఇలాంటి మహిళలకు ఈ క్రీడలేమీ కొత్తగాదు. పెళ్లికాలేదే పిల్లలతల్లి నౌతానేమో అనేభయం ఉండదక్కడ. ఐనా జూలియట్ తనకు శ్యామసుందర్ నుంచి ఒక బిడ్డను కావాలని తాపత్రయపడింది. దీనికి ఆశ్చర్యపడనక్కరలేదు."

శ్యామసుందర్ ఢిల్లీ నుంచి తిరిగి వచ్చాకా తండ్రి అవస్థలో మార్పు కొట్టవట్టినట్టు పసికట్టేందుకు అట్టేకాలం పట్టలేదు. ఆ తర్వాత తండ్రి, కొడుక్కి ఆ అమెరికానుంచి వచ్చిన ఉత్తరాలు చూపించి ఉంటాడు. శ్యామసుందర్ వాటిని మళ్లీ మళ్లీ చదువుకొని హాయిగా ఊపిరి పీల్చుకునీ ఉంటాడు. ■

